క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ



నాగేశ్వరరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రమాదేవి

కడియం: మండలంలోని దుళ్ల గ్రామానికి చెందిన బొమ్మిడి నాగేశ్వరరావు క్యాన్సర్ బాధపడుతూ రాజమహేంద్రవరం స్వతంత్ర క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ రమాదేవి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి ఆయనకు పింఛన్ అందజేసింది.

ప్రజలకు పాలన మరింత చేరువ



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాను ఏర్పాటు చేసి మంగళవారానికి ఏడాది పూర్తయిన సందర్భంగా సీఎం జగన్‌కు గోదావరి పరిరక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాల పునర్విభజనతో ప్రజలకు పాలన మరింత చేరువ అయ్యిందన్నారు. కలెక్టరేట్ సహా ఇతర అన్ని ప్రభుత్వశాఖల కార్యాలయాలకు భవనాల నిర్మాణం చేయడానికి 24 ఎకరాల వరకు అవసరమవుతుందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం న్యాక్‌కు 8 ఎకరాలు ఇచ్చిందన్నారు. ఇప్పుడు ఆ స్థలంతో పాటు తెలుగు విశ్వవిద్యాలయం వద్ద ఉన్న 16 ఎకరాలను కూడా తీసుకుంటే శాశ్వతంగా కలెక్టరేట్ ఏర్పడుతుందన్నారు. తెలుగు విద్యాపీఠాన్ని నన్నయ విశ్వవిద్యాలయంలో విలీనం చేస్తే విద్యార్థులకు కూడా సౌలభ్యంగా ఉంటుందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు బర్రే కొండబాబు, జాలా నటరాజ్, కొంచాడ ఈశ్వర్, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు గోకవరం పోలీసులు తెలిపారు. గోకవరానికి చెందిన నాగుల శేఖర్‌బాబు(42) సోమవారం మధ్యాహ్నం పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని కుటుంబ సభ్యులు గోకవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేసినప్పటికీ పరిస్థితి విషమంగా మారింది. తర్వాత రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ మరణించినట్టు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివనాగబాబు తెలిపారు.

పేదలకు బియ్యం పంపిణీ

సీతానగరం: తల్లిదండ్రులైన దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆశీస్సులతోనే తాము ఉన్నతస్థితిలో ఉన్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మంగళవారం ఇనుగంటివారిపేటలో సర్పంచ్ సత్యం రాంపదు ఆధ్వర్యంలో ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.. 1500 మంది పేదలకు రూ 5.25 లక్షలు విలువైన బియ్యం పంపిణీ చేశారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి డాక్టర్‌బాబు, పిచ్చుకల రవికుమార్, చల్లమళ్ల సుజీరాజు పాల్గొన్నారు. సింగవరానికి చెందిన పార్టీ నాయకుడు అంబటి రమణ ఆధ్వర్యంలో గ్రామాల్లోని ఎస్సీపేటలకు కేక్‌లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

ఐఎస్‌టీఎస్‌కు 'బెస్ట్' కాలేజ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉపేంద్రరెడ్డి

రాజానగరం: తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళ ఇంజినీరింగ్ కళాశాలకు ఆసియా ఎడ్యుకేషన్ సమ్మిట్ 2023 నుంచి 'బెస్ట్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజ్' అవార్డు లభించిందని ఆ కళాశాల చైర్మన్ పి.ఉపేంద్రరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ అవార్డును విదేశాంగశాఖ సహాయ మంత్రి డాక్టర్ రాజుకుమార్ రంజన్ నుంచి న్యూఢిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో తాను అందుకున్నానన్నారు. అలాగే తమ కళాశాల 2022లో నాక్ ప్లస్ గుర్తింపు పొందినందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి ప్రశంసలు, సత్కారం లభించాయన్నారు.

ఏడాది కాలం.. ప్రగతి ఘనం..

రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లా ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి, పాలనను ప్రజల ముందుకు తీసుకురావడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలను పునర్విభజించారు. దీంతో జిల్లాలన్నీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ప్రోత్సాహం లభించడంతో పాలన మరింత సులువైంది. – సీటీఆర్ఐ



జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్



జ్యోతిప్రజ్వలన చేసి జిల్లా ఆవిర్భావ వేడుకలను ప్రారంభిస్తున్న హోంమంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత, రుడా చైర్ పర్సన్ షర్మిలా రెడ్డి



జిల్లా ప్రగతి పథం ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న హోంమంత్రి వనిత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కలెక్టర్ మాధవీలత



మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాల నమూనా చెక్కు పంపిణీ



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

నేడు విద్యుత్ అంతరాయం

కడియం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. వేమగిరి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతులు, నిర్వహణ పనుల కోసం సరఫరా నిలిపివేస్తామన్నారు. కడియం, కడియపుసావరం, జేగురుపాడు గ్రామాల్లో విద్యుత్ ఉండదన్నారు.

కంప్యూటర్ విద్యతో ఉపాధి అవకాశాలు

ప్రకాశం నగర్: కంప్యూటర్ విద్య ద్వారా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అన్నారు మంగళవారం ఉదయం స్థానిక స్వర్ణాంధ్ర సేవా సంస్థ సమావేశ మందిరంలో కంప్యూటర్ నేర్చుకున్న ఐదు బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు ఉత్తీర్ణత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఇంటర్మీడియెట్, ఆపై చదువుకున్న వారికి ఉద్యోగానికి ఉపయోగపడే శిక్షణను ప్రత్యేకంగా రూపొందించామన్నారు. ఇప్పటి వరకు సుమారు మూడు వేల మందికి కంప్యూటర్ శిక్షణ ఉచితంగా ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఉపాధ్యాయులు సీహెచ్ రామకృష్ణ, మౌని, రవి, గంగాధర్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం, వస్త్రాల పంపిణీ



కేక్ కట్ చేస్తున్న జక్కంపూడి రాజా తదితరులు

- ఘనంగా జక్కంపూడి గణేష్ పుట్టిన రోజు వేడుకలు
- నగరంలో పలు సేవా కార్యక్రమాలు

సీటీఆర్ఐ: ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగ జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ జన్మదిన వేడుకలను మంగళవారం రాజమహేంద్రవరంలో పలుచోట్ల అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా కంబాల చెరువు సెంటర్‌లోని జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహం వద్ద అడపా రాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, ఆటో కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొన్నారు.

● పరశురామ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జక్కంపూడి గణేష్ పుట్టినరోజు సందర్భంగా గౌతమీ జీవకారుణ్య సంఘంలో చీరలు, దుప్పట్లు, లుంగీలు, టవళ్లు పంపిణీ చేశారు. సుమారు వంద మందికి అన్నదానం చేశారు. కార్యక్రమానికి హాజరైన టి.భాస్కరరావు(ఓఎన్జీసీ) కేక్ కట్ చేశారు. యానాపు పరశురామ్, మంచు ప్రవీణ్, కట్టా జగదీష్, రామ్ ప్రసాద్, బాబ్జి, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రకాశం నగర్: ది గోదావరి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజమహేంద్రవరం జోన్ కార్యదర్శి శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం దానవాయిపేటలోని జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్‌కట్ చేసి, రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జక్కంపూడి రాజశ్రీ

బొమ్మూరులో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని సూర్యభగవాన్ ఆలయంలో అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివేకానంద మహారోగి ఆరోగ్యకేంద్రంలో రోగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, సచివాలయ కన్వీనర్ మేడపాటి సద్గుణ రామారెడ్డి చేతుల మీదుగా భోజనాలు ప్రారంభించారు. బొమ్మూరు గ్రామసచివాలయ కన్వీనర్ మేడపాటి సద్గుణ రామారెడ్డి ఆధ్వర్యంలో వివేకానంద మహారోగి ఆరోగ్యకేంద్రంలో మంగళవారం రాత్రి రోగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, మత్సేటి శివ, కేవీ సుబ్బారెడ్డి, తోడేటి రాహుల్ పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- లబ్ధిదారులకు నమూనా చెక్కు పంపిణీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అక్కాచెల్లెమ్మల కష్టాలు తీర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని 5, 31, 32 డివిజన్లకు చెందిన వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు మంగళవారం స్థానిక అశోకా థియేటర్ సమీపంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన సొమ్ములను దుర్వినియోగం చేయకుండా స్వశక్తిపై ఆధారపడేలా వ్యాపారానికి వెచ్చిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. రానున్న ఎన్నికలలో మరోమారు జగనన్నే సీఎం అయ్యేలా మీ అందరి మద్దతు, ఆశీస్సులు కావాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రాష్ట్ర తెలికుల గాండ్ల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిన భవానీ ప్రియ, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, అడిషనల్ కమిషనర్ పి.సత్యవేణి, సిటీ మిషన్ మేనేజర్ రవిశంకర్, క్లస్టర్ ఇన్‌చార్జులు కొత్తా విజయ రాజ్యలక్ష్మి, బర్రే కొండబాబు, పోలు విజయలక్ష్మి, బీసీ సెల్ నగర అధ్యక్షుడు మజ్జి అప్పారావు, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ మజ్జి నూకరత్నం, లంక సత్యనారాయణ, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

సీటీఆర్ఐ: చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కోటిలింగాల ఘాట్, సమీపంలోని పీఎంకే చౌల్ట్రీ, కోటిలింగాల సెంటర్, సీతంపేట రామాలయం సెంటర్, గోకవరం బస్టాండు, నందం గనిరాజు జంక్షన్, అప్సరా థియేటర్ శ్యామలాంబ (సోమాలమ్మ) ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎంపీ భరత్‌రామ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాలైన పశుపక్షాదుల దాహార్తిని తీర్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తే చాలా మంచిదన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ మార్గాని సురేష్, పీఎంకే చౌల్ట్రీ ఈఓ వీవీ పల్లంరాజు, సూపరింటెండెంట్ డి.సురేష్ బాబు, కోటిలింగేశ్వరస్వామి దేవాలయం ఈఓ బీహెచ్ మూర్తి, అరవ సురేష్, ముప్పన శ్రీను, సప్పా ఆదినారాయణ, పోలు విజయలక్ష్మి, అరిగెల బాబు, దుంగా సురేష్ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

నేడు వైద్యశిబిరం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఉదయం 9.30 గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందన్నారు. జీఎస్ఎల్ వైద్యులు సేవలందిస్తారన్నారు. అలాగే సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం జరుగుతుంది.

జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

కంబాలచెరువు: స్థానిక సీటీఆర్ఐ సుబ్రహ్మణ్య నగర్‌కు చెందిన సీహెచ్ లక్ష్మీరామ్మోహనరావు (42) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ధవళేశ్వరం జల వనరులశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన మద్యానికి బానిసగా మారాడు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా.. లక్ష్మీరామ్మోహనరావు ఇంటి నుంచి దుర్వాసన రావడంతో యజమాని తలుపు తీసి చూసేసరికి ఆయన విగతజీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్నా ఆశ్రయ ఫౌండేషన్‌లో భోజనం వితరణ

మధురపూడి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సుదర్శన ఆయుష హోమం జరిపారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం సమీపంలోని కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్‌లో మానసిక విద్యార్థులకు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ సహకారం, సహాయానికి చిరునామాగా గణేష్ నిలిచాడన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఏఎంసీ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, ఉల్లి గణ, కంటే వినయ్ తేజ, చిక్కిరెడ్డి దుర్గాభాస్కర్ పాల్గొన్నారు.



కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

బ్యాగులో నగలు మాయం

కంబాలచెరువు: గాడాల నుంచి రాజమహేంద్రవరం వస్తున్న మహిళ బ్యాగులో బంగారు నగలు చోరీకి గురైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. హైదరాబాద్‌కు చెందిన పి.రామలక్ష్మి గాడాలలోని బంధువుల ఇంటికి వచ్చింది. తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు గాడాలలో ఆటో ఎక్కింది. గోకవరం బస్టాండ్ వద్ద ఆటో దిగి చార్జీ ఇద్దామని బ్యాగులో చూసుకునే సరికి 18 కాసుల బంగారు నగల పొట్లం కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కన్నమాంబ జాతర



జాతరలో పాల్గొన్న చందన నాగేశ్వర్



అమ్మవారి ఘటాల ఊరేగింపు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక నరసింహారావుపేట(ఆల్కాట్‌తోట)లోని కన్నమాంబ పేరంటాలమ్మ జాతర మహోత్సవం మంగళవారం రాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా అర్ధరాత్రి రైల్వేస్టేషన్ ఎదురుగా కన్నమాంబగుడికి చేరుకుంటారు. సింహాద్రి అప్పన్నసేవ, అమ్మవారికి సేవ, వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ తల్లి

రంగంపేట: ఈలకొలనులో కొలువైన ముత్యాలమ్మ తల్లి వార్షిక తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి స్వరూపాలైన గరగలను గ్రామంలో ఇంటింటికీ ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చలివిడి, వడపప్పు, నైవేద్యం అమ్మవారికి సమర్పించారు. జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, గ్రామ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ ఎరుబండి సూరిబాబుల ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కుటుంబ ఆరోగ్య సర్వే

బిక్కవోలు: మండలంలోని రంగాపురం గ్రామంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సంస్థ ఆధ్వర్యంలో కుటుంబ ఆరోగ్య సర్వేను మంగళవారం నిర్వహించారు. గ్రామంలో సర్వే పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని సర్వే టీం సభ్యుడు జగదీష్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండికోట వీరభద్రరావు, పంచాయతీ కార్యదర్శి పావని, ఏఎన్ఎం లత, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

కోతలు ముమ్మరం.. దిగుబడి ఆశాజనకం..

- చురుకుగా రబీ వరికోతలు
- రైతుల హర్షం



తొర్రేడులో ధాన్యం బస్తాలను లారీలోకి ఎక్కిస్తున్న కూలీలు



వెంకటనగరంలో జరుగుతున్న వరికోతలు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో రబీ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది దిగుబడితో పాటు ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో రబీ సీజన్‌లో బోర్లమీద ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. మండలంలో 2,830 ఎకరాలలో వరిని సాగు చేశారు. ఎక్కువగా ఆర్ఎన్ఆర్ 15048, బీపీటీ 5204 రకాలను పండించారు. రైతులకు పెట్టుబడికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతుభరోసా ద్వారా ఆపన్నహస్తం అందిస్తున్నారు. గత 20 రోజుల నుంచి తొర్రేడు, వెంకటనగరం, కాతేరు గ్రామపంచాయతీలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవలే కోలమూరు గ్రామంలో వరికోతలు మొదలయ్యాయి. హుకుంపేట, రాజవోలు, బొమ్మూరు, ధవళేశ్వరం గ్రామాల్లో మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకు మండలంలో 1,285 ఎకరాలలో వరికోతలు పూర్తయ్యాయి.

అంచనాకు మించి దిగుబడి

ఈ రబీ సీజన్‌లో అంచనాలకు మించి దిగుబడి నమోదైంది. పంటకోత ప్రయోగాల్లో సరాసరి ఎకరాకు 45 బస్తాలు వస్తోంది. ప్రస్తుతం వరికోత యంత్రాలతో కోసిన పచ్చిధాన్యాన్ని మిల్లర్లు బస్తా రూ.1600 నుంచి 1650 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు కొంత ఊరట లభించింది.

గిట్టుబాటు ధర



రబీ సీజన్‌లో మండలంలో వరి దిగుబడి ఆశాజనకంగా ఉంది. ఇప్పటివరకు 1,285 ఎకరాలలో కోతలు పూర్తయ్యాయి. వారం రోజుల్లో మిగిలిన ప్రాంతాల్లో మొదలవుతాయి. రైతుకు పండించిన ధాన్యానికి మార్కెట్‌లో ప్రస్తుతం రూ.1600 నుంచి రూ.1650 పలుకుతోంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర కల్పిస్తోంది.

– ఏ.భీమరాజు, వ్యవసాయాధికారి, రాజమహేంద్రవరం రూరల్

ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం బస్తాకు రూ.1540 ధరను ఇస్తుంది. గత ఖరీఫ్‌లో గోదావరి పెరిగి జల్ల కాలువ వెనక్కుతన్నడంతో తొర్రేడు, వెంకటనగరం, కాతేరు, కోలమూరు వరి పొలాలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో వరి దిగుబడితో పాటు గిట్టుబాటు ధర ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.